క్లుప్తంగా

షేర్‌మహ్మద్‌పేట-గండ్రాయి రోడ్డుకు మహర్దశ

జగ్గయ్యపేట: షేర్‌మహ్మద్‌పేట నుంచి గండ్రాయి వరకు సుమారు 5 కి.మీల ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరయ్యాయి. గత టీడీపీ హయాంలో అరకొరగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే ఇటీవల రొడ్డు అధ్వానంగా మారటంతో రాకపోకలకు ప్రజలకు ఇబ్బందులు పడుతుండటంతో తెలంగాణ, ఏపీ ప్రజలు కూడా ఈ రహదారి గుండా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో రెండు గ్రామాల ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గండ్రాయి ప్రధాన రహదారికి ఆర్‌అండ్‌బీ నిధుల నుంచి రూ. 2.50 కోట్ల మంజూరుకు సిఫారసు చేయటంతో అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి జీవో విడుదలైంది. మరి కొద్దిరోజుల్లో రోడ్డు నిర్మాణం చేపడుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కంచికచర్ల: మండలంలోని మమ్రే ప్రార్థనా మందిరంలో యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పాస్టర్ గోన జాన్ సోమవారం తెలిపారు. ఈ కమిటీని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ డాక్టర్ బందెల జయానంద్ అధ్యక్షతన జరిగిందన్నారు. మండల కమిటీ అధ్యక్షుడు పాస్టర్ బంకా నెహేమ్యా, కార్యదర్శి బిట్టు సుధీర్‌కుమార్, కోశాధికారి నాయిని విజయ్, ఉపాధ్యక్షుడు బైపి విజయ్, జాయింట్ సెక్రటరీ ఉప్పులూరి విశ్వాస్ కుమార్, జాయింట్ ట్రెజరర్ గోన జాన్‌తో పాటు పలువురు పాస్టర్లను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నామన్నారు. అనంతరం అధ్యక్షుడు నెహేమ్యా మాట్లాడుతూ, పాస్టర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయిస్తామని, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా పాస్టర్లకు రుణాలు అందేలా చేస్తామని కొనియాడారు.

డిజిటల్ పరికరాలతో మెరుగైన విద్యాబోధన

కంచికచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన డిజిటల్ పరికరాలతో ఇస్తామని కోర్సు డైరెక్టర్ జి. శ్యాంబాబు పేర్కొన్నారు. మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కంచికచర్ల, చందర్లపాడు, మండలాల్లోని అప్పర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు డిజిటల్ తరగతులపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఇంటరాక్టివ్ ప్యానల్స్‌పై ముందుగా శిక్షణ ఇచ్చామని, నాడు- నేడు పనులు పూర్తయిన పాఠశాలలకు ఇప్పటికే స్మార్ట్ టీవీ, ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ మొదలగునవి ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా పంపిణీ చేస్తామన్నారు. పాఠశాల రోజు వారీ పాఠ్య బోధనలో టెక్నాలజీ వినియోగంపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్. కనకదుర్గ, ప్రమీల, మురళీమోహన్ పాల్గొన్నారు.

50 గ్రాముల బంగారం చోరీ

కన్నెవీడు(వత్సవాయి): అర్ధరాత్రి దొంగలు పడి 50 గ్రాముల బంగారాన్ని దొంగిలించిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చిన్నం రాంచంద్రరరావు రాజ్యలక్ష్మి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ ఉంటారు. రోజు మాదిరిగానే రాత్రి సమయంలో భోజనాలు ముగించుకొని నిద్రపోయారు. బంగారం ఇంట్లో బీరువాలో ఉండడంతో రాంచంద్రరరావు బీరువా తాళం చెవిని దిండుకింద పెట్టుకుని పడుకున్నాడు. రాత్రి సమయంలో దొంగలు పడి దిండుకింద ఉన్న తాళం చెవిని తీసుకుని బీరువాలో ఉన్న రెండు చైన్లు, చెవి దిద్దులు, జూకాలను దొంగిలించారు. తెల్లవారిన తర్వాత బీరువా తెరిచిఉండడంతో కంగారుపడిన వారు మొత్తం చూసుకోగా బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ బి. అభిమన్యు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

చెస్ టోర్నమెంట్ విజేతకు అభినందన



మధురానగర్(విజయవాడసెంట్రల్): నెల్లూరులో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింట్ చెస్ టోర్నమెంట్‌లో అజిత్‌సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీ విద్యార్థి బత్తుల భానుప్రకాష్ అండర్ -16 విభాగంలో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా అకాడమీలో భానుప్రకాష్‌కు సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. అకాడమీ డైరెక్టర్ కోచ్ అవ్వారు రామకృష్ణ భానుప్రకాష్‌ను జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భానుప్రకాష్ తన ర్యాపిడ్ రేటింగ్‌ను 68 పాయింట్‌లు సాధించటం ద్వారా తన రేటింగ్‌ను 1084కు మెరుగు పరుచుకున్నారన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్తమ ప్రదర్శన చేయాలని ఆకాంక్షించారు.



ముస్తాబైన పేటలోని సీహెచ్‌సీ



బలుసుపాడు రోడ్‌లో ఉన్న జగనన్న కాలనీలో నిర్మితమైన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

ఆరోగ్య గోపురాలు

- జగ్గయ్యపేటలో సరికొత్తగా సిద్ధమైన సామాజిక ఆరోగ్య కేంద్రం
- రూ. 3 కోట్లతో సౌకర్యాల పెంపు
- 13మంది వైద్యుల నియామకం
- మరో రెండు హెల్త్ సెంటర్ల నిర్మాణం కూడా పూర్తి
- నేడు వైద్య శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అనేక సంస్కరణలు చేపట్టారు. మునుపెన్నడూ లేని విధంగా వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఈ క్రమంలో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి(సామాజిక ఆరోగ్య కేంద్రం) స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఆస్పత్రిలో నూతనంగా అదనపు భవనాలు నిర్మించారు. వైద్యుల సంఖ్యను పెంచారు. పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. అదే విధంగా పట్టణంలోని తొర్రగుంటపాలెంలోని చిల్లకల్లు రోడ్, బలుసుపాడు రోడ్‌లోని జగనన్న కాలనీ లేఅవుట్-2లో ఏర్పాటుచేసిన అర్బన్ హెల్త్ సెంటర్లు సరికొత్తగా ముస్తాబయ్యాయి. ఈ మూడింటిని మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ విప్ ఉదయభానుతో కలిసి ప్రారంభించనున్నారు.

సీహెచ్‌సీకి కొత్త రూపు..

జగ్గయ్యపేటలోని సామాజిక ఆరోగ్యం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. రూ. 3 కోట్లతో అదనపు భవనాలు నిర్మించారు. 30 పడకలుగా ఉన్న ఆస్పత్రిని నుంచి 50 పడకలకు పెంచారు. కొత్తగా ఓపీ బ్లాక్, ఓటీ బ్లాక్, వార్డులు నిర్మించారు.నాడు-నేడులో భాగంగా ఈ పనులు చేపట్టారు. ఒక్కప్పుడు ఇద్దరే వైద్యులు ఉండేవారు. ఇప్పుడు ఏకంగా 13 మంది వైద్యులు కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని రీతిలో వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే విజయవాడ తర్వాత ఎక్కడా లేని విధంగా డయాలసిస్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్, 24 గంటలు పనిచేసే బ్లడ్ స్టోరేజ్ యూనిట్, అంబులెన్స్ వంటి సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

రెండు అర్బన్ సెంటర్లు..

పట్టణ వాసుల శ్రేయస్సుకు పట్టం కట్టేందుకు వినూత్నంగా ప్రతి 25 వేల జనాభాకు ఒక డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు రూ. 90 లక్షల చొప్పున కేటాయించి భవన నిర్మాణాలను చేపట్టారు. దానిలో భాగంగా పట్టణంలోని తొర్రగుంటపాలెం, చిల్లకల్లు రోడ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. అలాగే బలుసుపాడు రోడ్‌లోని జగనన్న కాలనీ లేఅవుట్-2 లో నూతనంగా నిర్మించిన మరొక అర్బన్ హెల్త్ సెంటర్‌ను కూడా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ప్రారంభించనున్నారు. వివిధ విభాగాలకు గదులు, ఫర్నీచర్, మంచాలు, వైద్య సిబ్బంది అంతా సమకూర్చడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి.

కనీవిని ఎరుగని రీతిలో 'సురక్ష'

నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



తోటరావులపాడు సచివాలయంలో సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్(చందర్లపాడు): దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వాధికారులే గ్రామాలకు వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకోవటమే కాకుండా వాటిని పరిష్కరించేందుకు క్యాంపులు నిర్వహించటం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే చూస్తున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలంలోని తోటరావులపాడు, గుడిమెట్ల గ్రామ సచివాలయాలలో అధికారులు నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు అధికారుల చుట్టూ తిరిగేవారని కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారన్నారు. ఏవైనా చిన్నచిన్న కారణాలు, సాంకేతిక లోపంతో అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్ ములకలపల్లి లక్ష్మీ, తహసీల్దార్ సుశీలాదేవి, నాయకులు ములకలపల్లి కృష్ణమోహన్, బుగ్గినేని సురేష్, కర్ల తిరుపతిరావు, పలువురు నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు 4వ సచివాలయ పరిధిలో..

నందిగామ: పట్టణ పరిధిలోని 4వ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మండలంలోని దాములూరులో సచివాలయం వద్ద, గొల్లమూడిలోని సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: మండలంలోని పెనుగంచిప్రోలు-3, గుమ్మడిదూర్రు సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలో చిల్లకల్లు, జయంతిపురం గ్రామాలలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ సోమవారం తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో బృందాలు ఆయా గ్రామాలలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని చెప్పారు.

పవన్ కల్యాణ్ చిత్రపటాలు దహనం



పేటలో పవన్ కల్యాణ్ చిత్రపటాలను దహనం చేస్తున్న వలంటీర్లు

జగ్గయ్యపేట అర్బన్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గ్రామ/వార్డు సచివాలయాల వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని జగ్గయ్యపేట పట్టణంలోని వలంటీర్లు తీవ్రంగా ఖండించారు. సోమవారం పట్టణంలోని 14 సచివాలయాలకు చెందిన వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పవన్ కల్యాణ్ చిత్ర పటాలను దహనం చేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ పవన్ వ్యాఖ్యలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. తమకందరికీ భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరలా ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే తగిన విధంగా బుద్ధి చెబుతామని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, నాయకులు కాసర్ల బాలస్వామి, శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం.. సామాజిక నేరం



విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

నందిగామ: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని ఆ శాఖ విజయవాడ రూరల్ ఈఈ డీవీ శ్రీనివాసరావు అన్నారు. నందిగామ మండలంలోని పలు గ్రామాలలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 43 బృందాలుగా ఏర్పడి 2,451 సర్వీసులను తనిఖీ చేశారు. ఆయా సర్వీసులలో 259 వినియోగదారులు అధిక లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వారికి రూ. 8,05,172 లక్షల అపరాధ రుసుం విధించారు. అనంతరం నందిగామలో ఏర్పాటు చేసిన వినియోగదారుల సమావేశంలో అధికారులు మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దన్నారు. ఎవరన్నా వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే 9440812085కు సమాచారమివ్వాలన్నారు. ప్రతి వినియోగదారుడు ఇంట్లో వినియోగిస్తున్న లోడ్ వివరాలు అధికారులకు తెలియజేయాలన్నారు. ఆ శాఖ విజిలెన్స్ ఈఈ జి. కమల కుమారి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

నేడు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి సన్మానం



లక్కీడిప్ తీస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌ఓ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూలై 11 ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ నియంత్రణ కార్యక్రమ అమలులో వివిధ హోదాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సన్మాన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసినితో కలిసి లక్కీడిప్ తీశారు. వివిధ పద్ధతుల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. లక్కీడిప్‌లో ఎంపికైన వారు ఏయే ఆస్పత్రుల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్నారో ఆయా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బందిని సత్కరిస్తామన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, కౌన్సిలర్లకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జె.ఉషారాణి, ఎస్.లక్ష్మోజి తదితరులు పాల్గొన్నారు.

స్వరాజ్య మైదానం కూడలిని సుందరంగా తీర్చిదిద్దండి



స్వరాజ్య మైదానం బయటి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్య మైదానం కూడలిని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్వరాజ్య మైదానం చుట్టూ ఉన్న ప్రదేశాలను, ఫుట్‌పాత్‌లను, డివైడర్స్‌ను మరింత అందంగా తీర్చిదిద్దడానికి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అంబేడ్కర్ స్మృతివనం విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన స్మృతివనం ఆవరణలో వర్షపు నీటిని గుంటలను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి వర్షపు నీటిని డ్రెయిన్‌లోకి మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల మోటార్లు ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరస్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ పార్కు పరిశీలన

నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం అధికారులతో కలిసి కృష్ణలంక జాతీయ రహదారి వెంబడి ఉన్న అంబేడ్కర్ పార్కును పరిశీలించారు.

పార్కులో జరుగుతున్న పునరుద్ధరీకరణ పనులను, గ్రీనరీని పరిశీలించారు. పార్కులో వేసిన గ్రానైట్ డిజైన్స్ ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కులో గ్రీనరీ పచ్చదనం పెంపుపై ఏడీహెచ్ మరింత దృష్టి సారించాలన్నారు. కమిషనర్ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సొసైటీ స్థలాలపై కలెక్టర్ విచారణ

తిరువూరు: స్థానిక ఎన్ఎస్‌పీ క్యాంపు కాలనీలో గతంలో ప్రభుత్వోద్యోగులకు పంపిణీ చేసిన ఇళ్లస్థలాల విషయంలో నెలకొన్న వివాదంపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సోమవారం విచారణ నిర్వహించారు. నాలుగో తరగతి ఉద్యోగులు, ఇరిగేషన్ ఉద్యోగులు, పోలీసు ఉద్యోగులు వేర్వేరుగా హౌసింగ్ సొసైటీలుగా ఏర్పడి ప్రభుత్వం నుంచి నివేశన స్థలాలు పొందారు. తమకు కేటాయించిన స్థలాలను నాలుగో తరగతి ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఆక్రమించిందని ఇరిగేషన్ సొసైటీ ఉద్యోగులు లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా, పలుమార్లు సహకార అధికారులు, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. లోకాయుక్త ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఈ వివాదంపై తిరువూరు తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సొసైటీల నిర్వాహకులను విచారించారు.

గృహాల రిజిస్ట్రేషన్లలో ఆటంకం లేకుండా చర్యలు

పటమట(విజయవాడతూర్పు): జేఎన్ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద కేటాయించిన గృహాల రిజిస్ట్రేషన్లలో ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కొత్త బిల్డింగ్ నందు గృహాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 7,210 ఇళ్లను ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి పరిష్కరించాలని చెప్పారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి చెల్లించవలసిన ఫీజుల వసూళ్ల కౌంటర్, డాక్యుమెంట్ కౌంటర్, ఈకేవైసీ కౌంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లతా, మేనేజర్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకాలనీలోని కల్యాణ మండపంలో ఈ నెల 12 నుంచి 25వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు లంకే జనార్దన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, దేహశుద్ధి తదితర అంశాలు ప్రయోగాత్మకంగా చేసి చూపించి వాటి వలన కలిగే ప్రయోజనాలు తెలియజేస్తామని పేర్కొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీఓ

నందిగామ: అర్జీల రూపంలో అందిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పలు సమస్యల పరిష్కారం కోరుతూ 8 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని ప్రతి మండల కేంద్రాలతో పాటు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

స్పందనలో మూడు అర్జీలు

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిందని తహసీల్దార్ శంకరబాబు సోమవారం తెలిపారు. స్పందనలో పలు గ్రామాల నుంచి సమస్యలు పరిష్కారం కోరుతూ మూడు అర్జీలు వచ్చాయని వచ్చిన అర్జీలను త్వరతిగతిన ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. బాలశంకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిశ్రీలక్ష్మీ, ఏపీఎం భాస్కరరావు పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం..

వీరులపాడు: స్పందనకు వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని సమస్యలను స్పందన కార్యక్రమంలో అర్జీ దాఖలు చేస్తే పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరు అర్జీలు అందాయని చెప్పారు.

పత్తి రైతు హుషారు



నందిగామ ప్రాంతంలో పడిపాదులు వేస్తున్న రైతులు

నందిగామ: రైతులకు అవసరమైన సమయంలో మేఘాలు వర్షిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇదే తరుణంలో గత 20 రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతులు పొలాలలో విత్తనాలు విత్తారు. అవి ప్రస్తుతం మారాకు దశలో ఉన్నాయి. ఈ తరుణంలో కొద్ది రోజులుగా మళ్లీ వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో పత్తి మొక్కలు ఎక్కడ చచ్చిపోతాయోనని రైతులు కొద్ది రోజులుగా ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి నందిగామ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. దీంతో రైతుల ఆశలు మళ్లీ చిగురించాయి.

నియోజకవర్గంలో 18,060 హెక్టార్లలో పత్తి సాగు..

వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఈ ఏడాది నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 18,060 హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేయనున్నారు. జూన్ మూడో వారంలో కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గ పరిధిలో 2,328 హెక్టార్లలో పత్తి సాగుకు శ్రీకారం చుట్టారు.ఆ మొక్కలు ప్రస్తుతం మారాకు దశలో ఉన్నాయి. సోమవారం కొందరు రైతులు పడిపాదులు వేయిస్తుండగా మరికొందరు రైతులు పంట సాగుకు శ్రీకారం చుట్టారు.

పొంగి పొర్లుతున్న వాగులు..

నందిగామ టౌన్: గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చందర్లపాడు మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని పాటెంపాడు గ్రామ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. రోడ్డు పై నుంచి వరద పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

సొసైటీల సీఈఓలకు ఘన సన్మానం



సొసైటీల సీఈఓలను సన్మానిస్తున్న చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

గంపలగూడెం: 2022-23 ఆర్థిక సంవత్సరంలో నూరుశాతం రుణాల రికవరీకి కృషి చేసిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈఓలకు ఘన సన్మానం లభించింది. గంపలగూడెం కేడీసీసీ బ్యాంకులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు సంబంధిత పది మంది సీఈఓలకు శాలువా కప్పి సన్మానించారు. రైతులకు సొసైటీల ద్వారా మెరుగైన సేవలను అందజేయడంతో పాటు, రుణాలను తిరిగి వసూలు చేయడంలో సీఈఓల కృషిని ప్రశంసించారు. సీఈఓలు ఏ వెంకటనరసయ్య, షేక్ సుభానీ, ఎన్ నరసింహారావు, షేక్ ఉస్మాన్, సుగ్గల కృష్ణ, బి. శ్రీనివాసరావు, ఏ. శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మోహన్ రావు, వెంకటేశ్వర్లును సన్మానించారు. మేనేజర్ కనకదుర్గ పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవలో పాల్గొనాలి



మైలవరం: విద్యార్థులు సమాజ సేవలో కూడా పాల్గొనాలని లయన్స్ క్లబ్ పాస్ట్ మల్టిపుల్ చైర్‌పర్సన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఎస్‌వీఎస్ నివృత్‌రావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నార్త్ సౌత్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్స్ మొత్తం రూ.20.75 లక్షల విలువ చేసే చెక్‌లను 83 మంది విద్యార్థులకు సోమవారం అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నివృత్‌రావు మాట్లాడుతూ లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని ఇంత మంది విద్యార్థులు స్కాలర్‌షిప్స్ అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. నార్త్ సౌత్ ఫౌండేషన్, ఇండియా మేనేజింగ్ ట్రస్టీ చార్టెడ్ అకౌంటెంట్ జేఎస్ఆర్ ప్రసాద్, ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ హెల్త్ డిస్ట్రిక్ట్ 316డి లయన్ కామినేని అచ్యుత బాబు, ప్రిసైడింగ్ ఆఫీసర్ నార్త్ సౌత్ ఫౌండేషన్, విజయవాడ చాప్టర్ కో-ఆర్డినేటర్, లయన్స్ ఎడ్యుకేషనల్ స్కాలర్ షిప్స్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్ సూరపనేని వెంకటరత్నం, కళాశాల ప్రెసిడెంట్ జీ.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు ప్రసంగించారు.